క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలో శనివారం విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఏడీఈ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలు, ఇండోర్, బైపాస్ రోడ్డులు, రాంజల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, మాధవరం ఎస్ఐ కిరణ్ సూచించారు. శుక్రవారం రాత్రి వేర్వేరుగా మండలంలోని చెట్నేహళ్లిలో సీఐ, నారాయణపురంలో ఎస్ఐ పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకుల నుంచి మాట్లాడుతున్నామని ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని కోరితే చెప్పకూడదన్నారు. దిశ చట్టం మహిళలకు ఎంతో రక్షణగా ఉందని మహిళలలకు ఆపద సమయంలో ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఎవరైనా కర్ణాటక మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థి అదృశ్యం


వినోద్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని పైకొట్టాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి వినోద్ ఈనెల 7వ తేదీన తప్పిపోయాడని తల్లిదండ్రులు ఈరమ్మ, శంకర్ శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ ప్రహ్లాద్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 81067 94512 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతిచెందిన ఉలిగేష్

ఆదోని రూరల్: ఆదోని–సిరుగుప్ప మార్గంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉలిగేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన ఉలిగేష్‌ను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి బళ్లారికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు. మృతుడు ఆలూరు నియోజకవర్గంలోని హొళగుందకు చెందిన వ్యక్తి కాగా, అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

15లోపు సర్వే పూర్తి చేయండి

కౌతాళం: మండలంలో జరుగుతున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డు సర్వేను ఈనెల 15లోపు పూర్తి చేయాలని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటికే 80 శాతం సర్వేను పూర్తి చేశామన్నారు. ఈ సర్వే వల్ల రైతులకు ఎంతగానో ఉపయోగం ఉంటుందన్నారు. రైతుల పొలాలకు వెళ్లి ఆన్‌లైన్, అడంగల్, వన్‌బీ ప్రకారం భూమిలో సంబంధించిన రైతు ఉన్నాడా? లేదా అనే విషయాలను గుర్తించి గూగుల్ షీట్‌లో పొందుపరుస్తున్నామని తెలిపారు. ఈ సర్వే వల్ల పరిష్కారం కాని విస్తరణం గురించి, ఆన్‌లైన్‌లో ఒక రకంగా, ఒకరి భూమిలో ఒకరు ఉండి సాగుచేసుకుంటున్న విషయాలన్నీ గుర్తించడంతో పాటు, భూ రికార్డు సంపూర్ణంగా తెలుస్తుందన్నారు. ఆర్ఐ రాజశేఖర్ ఉన్నారు.

ముమ్మర ప్రచారం

ఆదోని రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపునకు కృషి చేయాలని ప్రభుత్వ ఉద్యోగులను ఎస్టీయూ, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదోనిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులను వారు ఓట్లను అభ్యర్థించారు. సీఐటీయూ జిల్లా, పట్టణ నాయకులు గౌస్‌దేశాయ్, రామాంజనేయులు, గోపాల్, తిప్పన్న, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శేషాద్రి

కౌతాళం: ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శేషాద్రి అన్నారు. కౌతాళంలో శుక్రవారం వైఎస్సార్ పొలం బడి కార్యక్రమాన్ని గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బందితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పంటల సాగులో ఆధునిక పద్ధతులను వినియోగించడం వల్ల అధిక దిగుబడులు, లాభాలను పొందవచ్చన్నారు. అలాగే వేరుశనగ పంటకు సోకే తెగుళ్లు, చీడపీడల లక్షణాలను వివరించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పది విజయానికి పక్కా ప్రణాళిక

- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్
- విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ
- పిల్లలు బడికి రాకపోతే ఇంటికి వెళ్లి విచారణ


రివిజన్ టెస్ట్ రాస్తున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)


పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆదోని అర్బన్: ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై సమావేశం, ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో? వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడం ఇవన్నీ ఏదో కార్పొరేట్ స్కూల్ గురించి అనుకుంటే పప్పులో కాలేసినట్లే. జగనన్న ప్రభుత్వంలో విద్యాశాఖ ప్రభుత్వ స్కూళ్లలో సైతం వీటిని అమలు చేసి అద్భుత ఫలితాలకు కృషి చేస్తోంది. ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు చేయని, చేయలేని విధంగా పాఠశాలల పనివేళలు ముగిశాక టీచర్లకు కొత్త బాధ్యత అప్పగించింది. విద్యార్థులు బడికి రాకపోతే ఇంటికి వెళ్లి ఆరాతీసి బడికి పంపేలా చర్యలు తీసుకోవడం, వారి ప్రిపరేషన్‌ను పరిశీలించడంతో పాటు తల్లిదండ్రులకు కూడా బాధ్యత గుర్తు చేసి శభాష్ అనిపించుకుంటోంది.

ఈ యేడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా కలెక్టర్, విద్యా శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. వెనకబడిన విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉదయం, సాయంత్రం గంట చొప్పున అదనంగా రెండు గంటలు సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్‌కు కృషి చేస్తోంది. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు కూడా ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

డివిజన్ పరిధిలో 15,142 మంది విద్యార్థులు

వచ్చే ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. నియోజకవర్గంలో 75 ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 46 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2,553 మంది విద్యార్థులు, 29 ప్రయివేట్ ఉన్నతపాఠశాలల్లో 1,701 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మొత్తం 4,254 మంది విద్యార్థులు ఉండగా, డివిజన్ పరిధిలో 15,142 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు.

మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. నాలుగు రివిజన్ టెస్టులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం ఎఫ్ఏ–3 పరీక్షలు ముగిశాయి. సోమవారం నుంచి రివిజన్ టెస్ట్ –2 ప్రారంభం కానున్నాయి. ఎఫ్ఏ–3 పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా వచ్చే బుధ, గురువారాల్లో జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టేలా చర్యలు తీసుకుంటాం.
– శివరాములు, ఎంఈఓ

ఫుల్ ప్రిపరేషన్

తరగతి గదుల వరకే ఉపాధ్యాయుల బోధన పరిమితం గాకుండా విద్యార్థుల ప్రగతి ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించారు. 70 శాతం మార్కులు తెచ్చుకున్న వారిని ఏ, 50 శాతం మార్కులు తెచ్చుకున్న వారిని బీ, 35 నుంచి 49 శాతం మార్కులు తెచ్చుకున్న వారినీ సీ, ఫెయిల్ అయిన వారిని డీగా గ్రూపులుగా విభజించారు. ఇందులో పది మంది పిల్లలను ఓ ఉపాధ్యాయుడు దత్తత తీసుకుని వారికి అర్థం గాని సబ్జెక్టులను అర్థమయ్యేటట్లు బోధించడం, ముఖ్యమైన పాఠ్యాంశాలను వారితో సాధన చేయించడం, రాయించడం వంటి శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ఒక ప్రశ్న ఇచ్చి ఇంటి వద్ద రాసుకునిరమ్మని చెబుతున్నారు. పాఠశాల వద్ద రాయించడం, చెప్పించడం, బాగా చదివే వారితో వెనకబడిన విద్యార్థిని కలిపి సాధన చేయిస్తున్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా చూసుకోవాలని, పిల్లలు చదువుతున్నారో లేదో గమనిస్తుండాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

పరీక్షలంటే భయం పోయింది



రెండు పూటలా స్టడీ అవర్స్ పెట్టడం వల్ల పబ్లిక్ పరీక్షలంటే మాలో భయం పోయింది. పాఠశాలలో టీచర్లు అన్ని సబ్జెక్టులను బోధిస్తున్నారు. పరీక్షలకు ఇంకా నెలన్నర సమయం ఉంది. క్లాసులో చెప్పిన పాఠాల్లో కఠినమైన చాప్టర్‌లను స్టడీ అవర్స్‌లో మళ్లీ రివిజన్ చేస్తున్నారు. ఎక్కువ మార్కులు సాధిస్తానన్న నమ్మకం పెరిగింది.
– సౌమ్య, పదో తరగతి విద్యార్థిని

సందేహాలను నివృత్తి చేస్తున్నారు



సబ్జెక్టుల వారీగా ఏవైనా సందేహాలు వస్తే ఉపాధ్యాయులు అర్థమయ్యేలా మళ్లీమళ్లీ చెబుతున్నారు. ఉదయాన్నే లేచి బాగా చదవాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇంటి వద్ద చదివించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ప్రస్తుతం చాప్టర్ల వారీగా రివిజన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
– వీరేష్, పదో తరగతి విద్యార్థి

పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్

కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన పేరెంట్స్ మీటింగ్ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అమలవుతోంది. పదో తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పిల్లలు ఎన్ని గంటలకు నిద్ర లేస్తున్నారు. ఎన్ని గంటలు చదువుతున్నారు అనే వివరాలపై వారి తల్లిదండ్రులతో మాట్లాడి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం


పెద్దకడబూరులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు: కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక పోస్టాఫీసు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్త గౌతమ్ ఆదానీ ఆర్థిక నేరాలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆదానీ బోగస్ కంపెనీలు, భారీ అవినీతి భాగోతంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ కమిటీ జేసీసీ వేసి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పోస్ట్ మేనేజర్ లాల్‌బాబుకు సమర్పించారు. రైతు సంఘం నాయకులు ఆంజినేయ, రాజు, ఏఐవైఎఫ్ తాలుకా కార్యదర్శి జాఫర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కంట్లో కారం కొట్టి చోరీయత్నం

ఆదోని అర్బన్: పట్టణంలోని హవన్నపేటలో ఓ మహిళ కామాక్షి అనే వృద్ధురాలి మెడలో బంగారు చైను, కమ్మలు చోరీ చేసేందుకు యత్నించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ శ్రీరాములు తెలిపిన వివరాలు.. ఓ మహిళ సచివాలయం నుంచి వచ్చానంటూ వృద్ధురాలితో మాటలు కలిపింది. ఈ పేపర్ మీద సంతకం చేస్తే రూ.10 వేలు వస్తాయని నమ్మించింది. ఆమె సంతకం చేస్తుండగా కంట్లో కారం కొట్టి చైను, రెండు కమ్మలు దోచుకుని పారిపోయింది. స్థానిక యువకుడు గుర్తించి పట్టుకోగా బంగారు ఆభరణాలు అక్కడే పడేసి పరారైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


కంబలదిన్ని గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరుతున్న శివస్వాములు

శివస్వాముల పాదయాత్ర

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబలదిన్ని గ్రామం నుంచి శివస్వాములు 41 రోజుల శివదీక్ష అనంతరం శుక్రవారం పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. తెల్లవారుజామున శివస్వాములు స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు కట్టుకున్నారు. ఈ సందర్భంగా శివస్వాములు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పురస్కరించుకొని శివమాలలు ధరించి పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటామన్నారు. శివ స్వాములను సాగనంపేందుకు కుటుంబసభ్యులు, బంధువులు భారీగా తరలివచ్చారు. ఆలయం నుంచి గ్రామ పొలిమేర వరకు మేళ తాళాలు, భజనలతో ఊరేగింపుగా వారిని సాగనంపారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్ అహ్మద్

ఆదోని టౌన్: ముస్లిం, మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్ అహ్మద్, మార్కెట్ యార్డు చైర్మన్ మాబాషా స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి కోవర్టుగా పనిచేస్తున్న ముస్లిం, మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ సిబిలీ నిరాధారమైన ఆరోపణలను మానుకోవాలన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లిం, మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. తండ్రి అడుగుజాడల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ ముస్లింలకు డిప్యూటీ సీఎం, మేయర్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వక్ఫ్ బోర్డు చైర్మన్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు లాంటి అనేక పదవులు కల్పించారని వివరించారు. ముస్లింలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధివైపు తీసుకెళ్లాలన్నదే సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఫరూక్‌కు నైతిక విలువలు లేవని, సీఎంపై ఈర్ష్యతోనే బురదజల్లే పని పెట్టుకున్నారని విమర్శించారు. నంద్యాలలో మైనార్టీలు, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ప్లకార్డులతో నిరసన చేస్తే అరెస్టులు చేయించిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కిందని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, కటికె కార్పొరేషన్ డైరెక్టర్ మస్తాన్, నాయకులు ఆర్టీసీ రహమాన్, అల్తాఫ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రి ప్రారంభం


కంటి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీ రెండో రోడ్డులో శుక్రవారం కార్తికేయాస్ దేశాయి నేత్రాలయం, అత్యాధునిక వసతులతో కూడిన ల్యాబ్‌ను ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. డాక్టర్ కార్తికేయ, డాక్టర్ వినీతాదేశాయ్ మాట్లాడుతూ.. ఎలాంటి దృష్టి లోపాలున్నా అత్యాధునిక పరికరాలతో పరీక్షలు చేసి చికిత్స అందించనున్నట్లు వివరించారు. ఆదోని పరిసర ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది పేదలే కావడంతో చికిత్స చేయించుకున్న వారికి ఫీజులో రాయితీ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

కోసిగి: రేణుక ఎల్లమ్మ జాతర పురస్కరించుకుని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి సహకారంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. కబడ్డీ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 52 జట్లు తలపడనున్నట్లు ఆర్గనైజర్స్ తెలిపారు. శనివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేల నగదు అందజేయనున్నారు. అలాగే వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నారు. అలాగే మౌంట్ కార్మెల్ పాఠశాల గ్రౌండ్‌లో నేడు ఓపెన్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించనున్నట్లు ఆర్గనైజర్స్ వేణు, సతీష్‌లు తెలిపారు.

తాగునీటి సరఫరా మెరుగుపరచండి


పంప్‌హౌస్ వద్ద వాటర్ వర్క్స్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ఆదోని టౌన్: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పీస్ పార్కులోని పంప్‌హౌస్ వద్ద తాగునీటి సరఫరాపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చిన్నచిన్నగా పైప్‌లైన్ లీకేజీలు చాలా ఉన్నాయని, వాటిని గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. పంపుహౌస్ వద్ద ట్యాంకర్లకు నీటిని వదలరాదని సూచించారు. మున్సిపాలిటీకి చలానా చెల్లించిన వారు లేదా కౌన్సిలర్లు, అధికారుల అనుమతి పత్రాలు ఉన్న వారికే ట్యాంకర్లకు నీటిని వదలాలని ఆదేశించారు.

నేడు మెగా లోక్‌అదాలత్

ఎమ్మిగనూరు: జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను శనివారం ఎమ్మిగనూరు ఫస్ట్‌క్లాస్ కోర్టులో నిర్వహించనున్నట్లు మెజిస్ట్రేట్ గురు అరవింద్ పేర్కొన్నారు. కక్షిదారులు రాజీమార్గంలో పయనించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రజాచైతన్యం ద్వారా లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


కనుమర్ల రఘునాథ రెడ్డి (ఫైల్)

హొళగుంద: సమ్మతగేరి వద్ద ఉన్న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆధునికీకరణ పనులు చేపడ్తున్న కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన కనుమర్ల రఘునాథరెడ్డి (20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ అబ్దుల్‌జహీర్ శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన కనుమర్ల రఘునాథ రెడ్డి సమ్మతగేరి వద్ద ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులు చేస్తున్న స్టాండర్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిలో చేరాడు. కాలువకు నీరు రావడంతో పనులు ఆగిపోయాయి. నిర్మాణ సామగ్రి అక్కడే ఉండడంతో రఘునాథ రెడ్డి మూడు నెలలుగా కాపలాగా ఉంటున్నాడు. ఈ స్థితిలో గురువారం సదరు యువకుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కంపెనీలో పని చేసే సిబ్బంది హొళగుంద పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక రఘునాథ రెడ్డి మృతి చెందాడు. ఇదిలాఉండగా.. ఎల్లెల్సీ పనుల కోసం తీసుకొచ్చిన కంకర అమ్ముకున్నాడని ఆరోపిస్తూ కంపెనీ ఎండీ శేషిరెడ్డి, మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా కొట్టడం వల్లే తన కుమారుడు చనిపోయాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి వెంకట రంగారెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

భక్తుల కొంగుబంగారం రేణుక ఎల్లమ్మ


ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ దేవి


రథోత్సవానికి సిద్ధమైన తేరు

కోసిగి: కొలిచే వారి కొంగు బంగారం, కోసిగి ప్రజల ఆరాధ్య దైవం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో శనివారం వేకువజాము నుంచి ఉథో.. ఉథో తాయి ఎల్లమ్మ అంటూ ఆలయ ప్రాంగణం మారుమ్రోగనుంది. ఏటా మాఘ మాసం శుద్ధ పంచమి రోజున అమ్మవారికి ఆలయ అర్చకులు అయ్యన్న గౌడ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గావించి పట్టు వస్త్రాలంకరణ, వెండికవచ అలంకరణ, మహా మంగళ హారతులు గావించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. కోసిగి మండలంలోని వివిధ గ్రామాల నుంచే గాక కర్నూలు జిల్లా సుదూర ప్రాంతాలు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కుడుములు, గుగ్గిళ్లు, నారికేళాలు సమర్పించి మొక్కులు చెల్లించనున్నారు. చర్మవ్యాధులు ఉన్న వారు అమ్మవారిని తలచుకుని మొక్కుబడిగా కేజీ పావు ఉప్పు సమర్పిస్తే చర్మవ్యాధులు తగ్గిపోతాయని ఇక్కడి భక్తుల అపార నమ్మకం. నేడు సాయంత్రం 5 గంటలకు వేలాది మంది భక్తుల మధ్య అమ్మవారి మూల విరాట్‌ను రథంపై కొలువుంచి అమ్మవారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథావిధిగా ఆలయం చెంతకు చేర్చుతారు.

అమ్మవారి చరిత్ర

భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారు. పూర్వం కోసిగి ప్రాంతం కరువు కాటకాలతో అల్లాడిపోతున్న తరుణంలో పెద్ద పెద్ద భూస్వాములు, రైతులు సైతం బతుకు దెరువు కోసం మూటాముల్లె సర్దుకుని పిల్లాపాపలతో వలస వెళ్లేవారు. ఈ తరుణంలో కోసిగికి చెందిన ఓ రైతు నీరు సమృద్ధిగా లభ్యమయ్యే కర్ణాటక రాష్ట్రం నీరుమాన్వికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని ఓ పెద్ద గంపలో మూటాముల్లె, సామానులు సర్దుకుని కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఇంట్లో సామాన్లు సర్దుతుండగా గంపలో నుంచి అమ్మవారి మూలవిరాట్ (చెక్క ప్రతిమ) అందులో నుంచి బయట పడింది. ఆ రైతు చెక్క బొమ్మ అని ఓ మూలన పడేశాడు. అయితే రాత్రి వేళ గజ్జల సవ్వడి, మెరుపుల శబ్దాలు కురిపించడంతో రైతు భయపడి మరో రైతుతో చెప్పాడు. మరుసటి రోజున అదే శబ్దం వినిపించడంతో ఆ రైతులు గట్టిగా అరిచి మీకు ఏమి కావాలని ప్రశ్నించగా నేను ఎల్లమాంబను నన్ను గ్రామ శివారులో కొలువుంచి పూజలు చేస్తే మీకు, మీ గ్రామానికి మంచి జరుగుతుందని చెప్పింది. నాటి నుంచి అమ్మవారిని కొలువుంచి ప్రత్యేక పూజలతో కొలుస్తున్నారు.

జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

జాతరలో భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా 6 ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేయిస్తున్నట్లు తెలిపారు. రాత్రిళ్లు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్‌ను కోరారు.

భారీ బందోబస్తు

రేణుక ఎల్లమ్మ దేవి జాతరకు వచ్చే భక్తాదులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అలాగే జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ ఎరిసావలి, ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 177 మంది పోలీసులు, 15 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 20 మంది మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు కల్పిస్తున్నట్లు తెలిపారు.

13న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి రథోత్సవం పురస్కరించుకొని ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటలకు న్యూ కేటగిరీ రాష్ట్రస్థాయి వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వృషభాలకు మొదటి బహుమతి రూ.40 వేలు, తరువాతి స్థానాలకు రూ.30 వేలు, రూ.20 వేలు, నాలుగో బహుమతి 16 తులాల వెండి, తర్వాతి స్థానాలకు రూ.10 వేలు, రూ.9 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వృషభాల యజమానులు 13వ తేదీ ఉదయంలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 99496 17011, 82478 86829 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న ఆలూరు సెబ్ పోలీసులు

ఆలూరు: బళ్లారి జిల్లా కేంద్రం నుంచి ఆలూరు మీదుగా వివిధ గ్రామాలలో విక్రయించేందుకు తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేఏ 34ఏ 6310 నంబరు గల టాటా ఏసీ వాహనంలో శుక్రవారం కర్ణాటక మద్యం తరలిస్తుండగా ఆలూరు సెబ్ ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. 864 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హాలహర్వి మండలం కామినహాల్ గ్రామానికి చెందిన గన్నె రాజీవ్, నెట్టెప్ప, ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామానికి చెందిన కల్లు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడులలో పీసీలు శ్రీనివాసులు, సాయికుమార్, రాజ్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.